# మున్నుడి

'ఎందెందు వెదకి చూచిన అందంద గలదు హరి' అన్నాడు ప్రహ్లాదుడు. అయితే వెదకవలసినది మనమే. ఆరాటంతో, భక్తితో శరణాగతితో వెదకాలి. అప్పుడు తప్పక కనబడతాడు. లోకాల యేలిక నెక్కడ వెదకం? అని నిరుత్సాహపడరాదు. జలధిలో చేపలా కనబడలేదా? పాతాళంలో కూర్మంలా.. ఆఖరికి ఆవుల మందలలో రామకృష్ణులుగా... నేటికీ జీవులందరిలోనూ అంతర్యామియైన శ్రీవేంకటేశ్వరునిగా నున్నాడు. అన్నమాచార్యులవారు హరి అవతారాలను చాలా కీర్తనలలో నర్మగర్భంగా చెప్పారు. కాని ఇందులో చాల తేటతెల్లంగా చెప్పారు.

**కం॥ ఇతనిని మించిన దైవము**
**'వెతికిన' కనరాడు ఘనుడు వేంకటపతియే**
**ఇతనివె పదిరూపములన్**
**నుతియించిరి అన్నమయ్య నోరూరంగన్**

**రాగం : మోహన**

ఇతనికంటే మరిదైవము కానము యెక్కడ వెదకిన నితడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారము తానె ॥ఇతని॥

మదిజలధులనొకదైవము వెదకిన మత్స్యావతారంబితడు
అదివో పాతాళమందు వెదకితే ఆది కూర్మమీ విష్ణుడు
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహుని కంటిమి
(బె)చెదరక కొండల గుహల వెదకితే శ్రీ నరసింహంబున్నాడు ॥ఇతని॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముడొకటైనాడు
తలపున శివుడును పార్వతి వెదకిన తారక బ్రహ్మము రాఘవుడు
కెలకుల నావుల మందల వెదకిన కృష్ణుడు రాముడునైనారు ॥ఇతని॥

పొంచి అసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు
మించిన కాలము కడపట వెదకిన మీదటి కల్క్యావతారము
అంచెల జీవుల లోపల వెదకిన అంతర్యామై మెరసెను
యెంచుక ఇహమన  వెదకిన యీతడే శ్రీవేంకట విభుడు ॥ఇతని॥

**భావామృతం :**

నరులారా! ఎక్కడ వెదకినా, మనకు ఇతనిని మించిన దైవము కానరాడు. ఈయనే అన్నిటికీ ఆధారమైన ఆది దైవము. అతిశయించిన దివ్య మహిమలతో ఈయన అనేక చోట్ల 'అవతరించి' దుష్టశిక్షణ శిష్టరక్షణ చేశాడు.

ఆ కథలన్నీ విన్నాం కదా!

మహాసముద్రంలో మత్స్యరూపంలో కనబడ్డాడు. మనస్సు అనే సముద్రంలో వెదకితే నేటికీ కనిపిస్తాడు. అదిగో చూశారా పాతాళంలో వెదకితే ఆదికూర్మమైన విష్ణువుగా కనిపించాడు. పొదిగొని (భారము వహించి) వెదకితే అడవులలో భూదేవితో నున్న వరాహమైనాడు. భయపడకుండా కొండలలో వెదకితే శ్రీనృసింహమూర్తిగా కనిపించాడు.

ఆయన మహిమను గ్రహించి వెదకితే "భూనభోంతరాల"లో (అంటే భూమిలోపల, భూమిమీద ఆకాశంలోను) సర్వమూ వ్యాపించి త్రివిక్రమునిగా (వామనావతారం) కనిపిస్తాడు. మహాపరాక్రమ వంతులలో వెదకితే పరశురామునిగా కనబడతాడు. శివపార్వతులకు కూడా భావించి వెదకితే తారక బ్రహ్మరూపంలో రఘురామునిగా కనిపించాడు. అంతెందుకు దిక్కులన్నింటిలోనూ (కెలకులలో) ఆవుల మందలలో వెదకితే బలరామకృష్ణులుగా కనిపిస్తాడు. కాకపోతే వెదకాల్సిన బాధ్యత మనదే.

పొంచియుండి వెదకితే రాక్షస స్త్రీలతో కూడా బుద్ధుని వలె కనబడతాడు. కలియుగం మించిన కాలంలో కూడా వెతికితే ఈ యుగాంతానికి కల్కి అవతారంలో కనిపిస్తాడు. అప్పటికి  మనమెలాగూ వుండము, కాబట్టి నేడే అంచెలలో (వరుసగా) జీవులలో వెదకితే అంతర్యామిగా దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపిస్తాడు. ఇహపరములలో వెదకితే ఆయనే వేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరునిగా కనిపిస్తాడు.